

# ఖరీదయిన స్నేహము

మాదిరెడ్డి సులోచన

స్పెషల్ వార్డులో పడుకున్నాను. మాటి మాటికి నాకళ్లు గుమ్మము వైపుకు తిరుగుతున్నాయి. రఫీ, రాజా, పాండే ...ఇంకా నా స్నేహబృందములో వారెవరయినా వస్తారేమోనని యెవరూ కనిపించలేదు నా బ్రతుకులాగే బోసిగా రోడ్డు కనిపించింది. నిరాశగా కళ్లు మూసుకున్నాను. ఇప్పుడు యెవరయినా రావటానికి నాదగ్గరేముంది?

"బావా !" ఆ పిలుపు సుధదే. తనెలా వస్తుంది ? కళ్ళు విప్పాను. నిజంగా సుధే. నా జీవితములో సుధలు కురిపిస్తానని ముందుకు వచ్చిన అత్తయ్య కూతురు. అవమానించి పంపాను. ఆమెను నాకివ్వడానికి సాహసించిన అత్తయ్య అజ్ఞానాన్ని హేళన చేశాను.

"గోపీ ! నా మాటవిను నీ స్వభావాన్ని అర్ధంచేసుకుని సర్దుకు పోగల అమ్మాయి ఒక సుధేరా..." నాన్న ప్రాధేయపడ్డాడు.

"నాన్నా ! నాకీ బంధువులంటే మంట. నువ్వారాసుకుని తిరిగితే తిరిగావు. ఈ బిడ్డ నాకు అంటగట్టాలని చూడకు" విసురుగా అన్నాను. నాకు అమ్మవంతపాడింది. సుధ మరొకరి ఇల్లాలయింది.

"బావా !"

ఆలోచనలు ఆపి లేచికూర్చోటానికి ప్రయత్నించాను. శరీరము తూలుతూంది. సుధ ఆసరా ఇచ్చి కూర్చోబెట్టింది.

"సుధా ! నాపై ... నాపై జాలి చూపుతున్నావా ?"

ఆమె కళ్ళుయెత్తి ఒకసారి నా వంక చూచింది. ఆ చూపులో 'నువ్వు యెప్పుడూఇంతే' అన్న నిరసన కనిపించింది. అటు తిరిగి తను పట్టుకు వచ్చిన బుట్టలోని పళ్ళు, సీసాలు అలమరలో సర్దింది.

"టమెటో సూప్ నీకిష్టంగా. ఒక కప్పు తాగుతావా ?"

"తీసుకురా..." అన్నాను. ఇంకేమన్నా ఆమె నొచ్చుకుంటుందని తెలుసు. జీవితములో నా అహంకారముతో యెదుటి వారిని నొప్పించిన సందర్భాలు కోకొల్లలు. అవి...ఆ సందర్భాలు ఇప్పుడు పగబట్టిన త్రాచుపాముల్లా నా హృదయములో బుస్సుమని, నామనఃశ్శాంతిని మింగేస్తున్నాయి.

"తీసుకో...ఒక్క అయిదునిమిషాలుఇలా కుర్చీలో కూర్చో పడక దులుపుతాను."అన్నది సుధ.

"ఉదయము నర్స్ దులిపింది." అన్నాను మొహమాటంగా.

"మళ్ళీ రేపు ఉదయమేగా." ఆమె చేయూతనిచ్చి కుర్చీలో కూర్చుండ బెట్టింది. సూప్ సిప్ చేశాను. పెప్పర్ యెక్కువగాపడిందేమో చురుక్కుమంది.

"మీ ఆయన బావున్నాడా సుధా ?"

"బావున్నారు బావా. వచ్చేవారే. సాయంత్రము యెవరో వచ్చారు" అన్నది. సుధభర్త లాయరు. ఈ మధ్యలాయర్ల రాబడిని గూర్చి చాలా నిరాశగా చెప్పుకుంటున్నారు. మరి సుధ భర్త యెలా నెట్టుకు వస్తున్నాడో !

"పేరుప్రఖ్యాతులు లేకుంటేనే పోయిబావా ఆయనకు పేరు రాకపూర్వము పోయిగాఉండే వారము. నెలకు వెయ్యి రూపాయలు వచ్చేవి.

గట్టుగా కాలక్షేపం జరిగేది. ఇప్పుడు ! రాబడి పెరిగింది. పేరు వచ్చింది కాని యెన్నో త్యాగం చెయ్యవలసి వచ్చింది. పండుగలు, పార్టీలు, అన్నీ, ఒక్కటేమిటి ?" అన్నది నిట్టూరుస్తూ. నా జీతం అంత ఉండన్న మాట. సుధ మరోగంట ఉండి వెళ్ళిపోయింది మళ్ళీ విసుగ్గా అనిపించింది. తల దగ్గర అందుబాటులో ఉన్న ఫోన్ మ్రోగింది. అందుకున్నాను. రఫీ మాట్లాడాడు. వాడురావాలనుకుంటే, తమ్ముడు సినిమా టికెట్లు బుక్ చేసి తెచ్చాడట. సినిమాకు వెడుతున్నాడట. వెళ్ళమని ఫోన్ పెట్టేశాను. కళ్ళు మూసుకున్నాను.

నాకు నిదరరావడం లేదు. గతించిన సంఘటనలు మనసును వేధిస్తున్నాయి.

"అరేబాయ్ గోపాల్...నువ్వింత బడా ఇంజనీరువు పెద్ద పార్టీ...అహా ... అందరూ మరిచి పోలేనంత పెద్దపార్టీ..." హడావుడి చేశాడు రఫీ.

"ఒరేయ్ బచ్చా ! అది మన గోపాల్‌ను అడగాలా వాడి హృదయము, వాడిపర్సు రెండు విశాలమయినవి..." తన మాటలకు తనే పరవశించాడు రాజా.

"నిజం...ఆమాట నేనుఅంగీకరిస్తున్నాను" పాండే వంతపాడాడు. వీళ్ళంతా పనిలేని వారేం కాదు. అంతా మంచి ఉద్యోగాల్లోఉన్న వారే. నేను కనిపిస్తే చాలు నా చుట్టూ చేరి భజన మొదలు పెట్టేవారు. అప్పుడు అదేదో గొప్ప విషయంగా భావించి పొంగి పోయాను భజన చేసే అవసరము ఏమిటని యెన్నడూ ఆలోచించ లేక పోయాను. రఫీకి సంవత్సరానికి కావలసిన పచ్చళ్ళు, పప్పులు మా ఇంటినుండి వెళ్ళేవి. రాజా వారంలో నాలు సార్లు మా ఇంట్లోనే భోజనము చేసేవాడు.

"అమ్మా ! ఉత్తర, దక్షిణాలు, తూర్పు పడమరలు చూచాను. ఏ హోటల్ వాడింత వరకు మీరు చేసినట్టు చేపల కూర చేయ లేదు" అమ్మపొంగి పోయేది. ఆ అమ్మ కొడుకునయినందుకు నేను గర్వించే వాడిని— ఒక వేళరాజా రాకపోతే మా ఇంట్లో వండిన కూరలు వాడింటికి పంపేవాళము-పాండే పిల్లలు బొద్దుగా ఉండేవారు-అంకుల్,అంకుల్ అంటూ వదలేవారే కాదు- ఆ పిల్లలకు ఆట సామాన్లు బట్టలు నేనే కొనేవాడిని-

"బావుంది ఖర్చు మా అన్నయ్య నెత్తిన కొట్టి మీరు దూరంగా నిలబడి పోతారేం ?" మిసెస్‌పాండే అడిగేది భర్తను-

"వాడిది పసిపిల్లలాంటి స్వభావము- అందుకే పిల్లలను చేరదీస్తాడు— వద్దని నొప్పించటం దేనికి ?" అనేవాడు- ఫారిన్ వెళ్ళే స్నేహితుల ద్వారా పాండే కొడుక్కి రకరకాల కార్లు తెప్పించాను- ఒక రోజు జరిగిన సంఘటన బాగా గుర్తుంది- అమ్మకు జ్వరం వచ్చిందని పెద్దమ్మకూతురు వచ్చింది- నాకు బంధువులంటే పరమ చికాకు- "నర్సును కుదుర్చుకుంటే పోయేదిగా అన్నాను— అమ్మ చిరుగా నవ్వింది— నాన్నమాత్రం చిరచిరలాడాడు అప్పుడే-

"నర్సువస్తే మీ అమ్మను చూస్తుంది- ఇల్లెవరు చూస్తారు!" నిజమే ఉన్నది ముగ్గురమయినా నా స్నేహితులు మరోముగ్గురుంటారు అమ్మకు ఆశ్రిత జనమున్నారు—ఆరోజేపాండే కొడుకు కోసము తెప్పించిన మెకానో సెట్టుకు వెయ్యిరూపాయలు అయింది- ఆ డబ్బు నేను ఇవ్వగా చూచింది పెద్దమ్మ కూతురు-ఆరాత్రికి నాకు స్వయంగా హార్లిక్స్ తెచ్చింది-

"గుండులేదా ?" అన్నాను చికాకుగా— గుండు అంటే మా పనిక్కురాడు వాడి పేరు ఏదో ఇంతపొడువుగా ఉంటే మా వాళ్ళు వాడిని బొద్దుగా ఉన్నాడని గుండు అంటూ పిలుస్తారు-

"ఉన్నాడు తమ్ముడూ నీతో ఒక చిన్న విషయము చెబుదామని-మా పెద్దోడి చదువు అయిపోయింది- మా ఊళ్ళో ఇంకొక్క సంవత్సరం అయితే మెట్రిక్ అవుతుంది-మా ఆడబడుచు అన్నం పెడతానంది- ఫీజునువ్వు కడితే..."

"ఫీజు నేను కడితే వాడు పాసయి నాకు పేరు ప్రతిష్టలు తెస్తాడు— మెట్రిక్ పాసయిన వాళ్ళు బోలెడు మంది బూట్ పాలిష్ చేస్తున్నారు." మధ్యలోనే ఆమె మాటత్రుంచేశాను. ఆమె కళ్ళల్లో కదలాడిన భావాలు చూచి సంతోషించాను. లేకపోతే నాస్నేహితుడికొడిక్కి వెయ్యిరూపాయల బహుమతి కొన్నానని ఏడుపుతో తన కొడుక్కి ఫీజుకట్టమంటుందా ! ఆ క్షణంలో అంతే ఆలోచించాను. మెకానో సెట్టుపిల్లలు ఓ మూల పడేశారు దానికి ఖర్చు చేసిన దాంట్లో పదోవంతు ...అంటే పంద రూపాయలు ఖర్చు పెడితే వాడికి యెంత ఉపయోగపడేదో ! ఆలోచన రాలేదు. తల [illegible]. కళ్ళు మూసుకుని నిదుర పోవాలని ప్రయత్నించాను. నిదురమాత్రం దినమంతా నాతోనే యెందుకుంటుంది ? దూరాన 'జనరంజని' పాటలు కాబోలువినిపిస్తున్నాయి.

"...తోడొకరుండిన అదేభాగ్యము !..."

ఉలిక్కి పడ్డాను. నేను చదువులో ఫస్ట్ మంచి పదవిలో ఉన్నాను. నాతోపాటు పాసయిన ఇంజనీర్లు చిన్న, చిన్న పనులు చేస్తున్నారు. అలాంటప్పుడు నేను గర్వపడటంలో తప్పులేదనుకున్నాను. ఓ సుపిరియారిటీ కాంప్లెక్స్ పెంచుకున్నాను. నాకు తెలిసిన విషయాలు మరెవరికీ తెలియదన్న నిర్ణయానికి వచ్చాను. నేను అన్నది నిజము కాబట్టిఅందరు అంగీకరించి తీరాలని పట్టుపట్టేవాడిని.అందరు అంగీకరించేవారు. తాడంటే, తాడు పేడంటే పేడు అనేవారు నా స్నేహితులు. దాంతో నా ఆత్మవిశ్వాసము మరింత పెరిగిపోయింది. వారు నా హోదాకు, డబ్బుకు తలవంచి, నాతో పబ్బం గడుపుకోవటానికి అలా అంటున్నారన్న గ్రహింపే లేదు. సంబంధాలు వస్తున్నాయి. ఒక్కటి నాకు తగినదని అనిపించ లేదు. నేను వివాహితుడిని అయితే తమఆటలు సాగవని కాబోలు నా స్నేహితులు కూడా వచ్చిన సంబంధాలకల్లా వంక పెట్టేవారు.

"మనవాడు పంజాబీయులలో పుట్టవలసిన వాడు. వాడికి తగిన అమ్మాయి కావాలి." అనేవారు. అలాంటప్పుడు నా రంగు, ఒడ్డు పొడవు చూచుకుని మురిసిపోయేవాడిని.

"ప్రతి వారిలో ఏదో ఒకలోపముంటుంది. రాజీ పడాలి." నాన్నగారు విసుక్కునేవారు.

"మీరు మరీనండి బాబాయిగారూ ! వాడి కోసం యెక్కడో పూజచేస్తున్నది. వాడు అన్నింటిలో ప్రత్యేకత కలిగినవాడు. ప్రత్యేకత కల అమ్మాయి దొరకాలి." రాజా అనేవాడు. నిజంగానే నా అహంకారానికి సవాలుగా నా జీవితంలో ప్రవేశించింది అమృత. పేరులోనే ఉందిగానీ స్వభావములో లేదు. ఇద్దరూ ఒకే అభిరుచులు గలవారు ఒకచోట ఉండగలరేమోగాని ఒకే స్వభావాలు గలవారు ఉండలేరు అది మా విషయంలో నిరూపింపబడింది. పదేళ్ళు పెళ్ళి చూపులతోగడిపాము. చివరకు అమృతక్లబ్బులోపరిచయముఅయింది. ఆమెను వివాహము చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. అమృతను మా వాళ్ళకు పరిచయము చేశాను. అమ్మవెంటనే ముహూర్తం పెట్టించమన్నది. మళ్ళీ యెక్కడ మనసు మార్చుకుంటానోనని ఆమె భయము. అమృత వాళ్ళింటికి వెళ్ళాము. అమృత అందరిముందే పనివాడిని నానా మాటలు అన్నది. కప్పులపై మరకలు కనిపించాయని. నాన్న యెందుకో ముఖం చిట్లించారు. ఇంటికి రాగానే తన అభిప్రాయము చెప్పారు.

"చూడు గోపీ, నువ్వు యెలాపెరిగావో ఆ అమ్మాయి అలాగే పెరిగింది. సంసారము చక్కగా సాగాలంటే, ఒకరుకాస్త తగ్గిఉండాలని నా భావన..."

"ఫ్యూడల్ థింకింగ్ ! అసలదానికి వ్యక్తిత్వం ఉండొద్దనేగా మీరు అనేది ?" నేను రోషంగా అడిగాను.

"ఛ...ఛ...నేను స్త్రీ, పురుషులని విశ్లేషించటము లేదురా. మీ ఇద్దర్లో ఒకరు సర్దుకు పోవాలి. మీ అమ్మ పట్టుదలను నేను సర్దుకు పోతుంటాను..." నాన్నగారు నవ్వలేక నవ్వారు.

"అదేం లేదు బాబాయ్ ! సంసారములో సర్దుకు పోవటం అంటూ ఉంటే సారం లేక చప్పగా ఉంటుంది గో అహెడ్ గోపీఅప్పుడే వచ్చిన రాజా ప్రోత్సహించాడు. నాన్నగారు తృప్తిగా అంగీకరించలేదు. నా స్నేహితులందరికీ అమృత పరిచయమైనట.

"అవునులే వాడి పెళ్ళాం కావాలనిఉందా మీ చెల్లెలు, మీ కోడలు మీకుకావాలి." విసురుగా అమ్మ నిష్ఠూరం వేసింది.

"నీకు అసలు మతిపోయింది. ఇప్పుడేపెళ్ళి ఆపినా, సుధను తెచ్చి చేయగలనా ! దాని పెళ్ళి అయిపోయింది. ఇక మీ ఇష్టం" అన్నారు.

క్లుప్తంగా మా వివాహము తిరుచానూరులో జరిగింది. అమృతను చూచి అందరూ అభినందించారు.

"ఇన్నాళ్ళ ఆగినా చక్కని జోడి..." అని నా స్నేహబృందము సంతోషము ఇంతా, అంతాకాదు. నాచేత రెండు వేల రూపాయలు ఖర్చుపెట్టించి పార్టీ తీసుకున్నారు. ఆ రోజే మా ఇద్దరి మధ్యభేదాభిప్రాయాలు మొదలు అయ్యాయి.

"అనవసరంగా స్నేహితులకోసం రెండు వేలు ఖర్చుపెడతారా ?" అమృత నిలదీసింది. నా అహం దెబ్బతిన్నది. నేను సంపాదించని రోజులలో, నా తల్లితండ్రుల డబ్బుతో నా స్నేహితులకు పార్టీలిచ్చాను, బహుమతులిచ్చాను, అప్పులిచ్చాను. వారు ఏనాడు ఆంక్షవిధించలేదు. ఆఫ్టరాల్ ఈ అమ్మాయి యెవరు !

"నా ఇష్టం !" అన్నాను పొగరుగా. అంతే మధురంగా గడువవలసిన రాత్రి ఒంటరిగా గడిపాను. నా జీవితంలో భాగం పంచుకుంటున్న యువతికి ఆ మాత్రం అధికారంలేదా, అని సర్దుకోబోయాను. అప్పుడే నా స్నేహితులు వచ్చారు. నా ఒంటరితనానికి కారణంకనుక్కొని తలాకరకంగా సలహాఇచ్చారు.

"ఒరేయ్ ! మాది బీబీ అయితే ఉల్‌బెట్ (గుంజీలు)చేయిస్తాం. నిన్ను మామూల్ మనిషి అనుకుందిరా...చోకరికి బుద్ధిరావలంటే నువ్వు ఖడక్‌గాఉండు." రఫీ సలహా ఇచ్చాడు. రఫీని చూస్తే సుధ మండిపడేది.

"ముఖస్తుతి చేసేవారిని మూడు మైళ్ళ దూరం ఉంచాలి." అంటారు నాన్న కాని వాడిమాటలు నాకు సంగీతంలా వినిపిస్తాయి.

"నీలాంటి వ్యక్తికి యెదురుతిరిగే సాహసమా !"

"మనమే వాడికి జడుస్తాముకదా !"

నా స్నేహితుల మాటలువింటుంటే నా అభిమానము రెట్టింపుఅయ్యేది. అమృతపట్ల పూర్తిగా నిరసనపెంచుకున్నాను. వారు అంతటితో ఆగలేదు. నాకు సలహాఇచ్చేవారందరితోను నా సంబంధాలు తెంచేశారు.

"మీ సుధ కనిపించిందిరా. యెంత గీర అనుకున్నావు...'నన్ను కాదన్నందుకు బాగా శాస్తిఅయిందని నిన్ను నానామాటలన్నదిరా." పాండేచెప్పాడు. సుధను కాదన్నా ఆమెలోని కొన్ని సుగుణాలు తెలుసు కాని ఆ క్షణంలో పాండే నా శ్రేయోభిలాషిగా కనిపించాడు. అందుకే సుధను పిలిపించి చెడా, మడా దులిపాను.

"మీ మధ్య భేదాభిప్రాయాలువచ్చినట్టు కూడా తెలియదు బావా ?" అన్న ఆమె మాటలు వినిపించుకోలేదు.

"ఒరేయ్ నీ ప్రాణస్నేహితుడని డబ్బాలా డతాడే శ్రీకర్, వాడు నీ గురించి చాలా, నీచంగా మాట్లాడుతున్నాడు." రాజాచెప్పాడు అందరితో తగవులే. సాయంత్రము అయ్యేసరికి మేం నల్గురం మీటింగ్‌వేసుకునేవారము.

"మీ మాయల ఫకీరు ఏడి ?" అనేది నాకు వాడంటే చాలా ఇష్టం.

నా హోదా, నా చదువు నేను అంటూ ఓమని షినిఉన్నాననే మరిచిపోయాను. స్నేహితులు చెప్పిందానికి తలాడించేవాడిని. రోజూ కోడి చేపలు వండించేవాడిని. ఒక వేళ్ళ అమ్మ విసుక్కుంటే వెంటనే చైనీస్ రెస్టారెంట్‌కి పంపి తెప్పించేవాడిని. వారంత ఆపులు లేరనిపించింది. అమృతకు విడాకుల నోటీస్ పంపుతుంటే అమ్మ వణికిపోయింది.

"ఏమిట్రా ఇది ? మీ ఇద్దరి స్వభావము ఒకలాంటిదే అని మీ నాన్నవద్దన్నారిపెళ్ళి. ఇష్టపడిచేసుకున్నావు. ఒక్కసారి పొరపాటు జరిగింది. సర్దుకుపోవాలి..." దీనంగా అడిగింది.

"మనవాడికేం తక్కువని..." రాజా అడ్డు వచ్చాడు.

"రాజా ఇన్నాళ్ళ మీరు ఏదిచెప్పినా వాడు విన్నా నేను యెదురుచెప్పలేదు పచ్చని కాపురములో చిచ్చుపెట్టాలనిచూచే మీరు స్నేహితులా ?" ఆవేశంగా అరిచింది అమ్మ

"నీ కోడలు వస్తూనే నిన్ను పొమ్మంటే ?" వెటకారంగా అడిగాడు పాండే

"అలాగే వెళ్ళిపోతాను. నాకు నా కొడుకు క్షేమముకావాలి." అన్నది దృఢంగా.

"ఊరోక్కవే...ఏమిటా మాటలు !" నాన్న వారించాడు.

"ఇదిగో అమ్మా, నేనేం చిన్న కుర్రాడిని కాదు నన్ను అమృత విషయములో బలవంతంచేస్తే ఇల్లు విడిచిపోతాను." అన్నాను. అమ్మా, నాన్న వాళ్ళలో వాళ్ళేం కుమిలిపోయారో, మళ్ళీ కోడలి ప్రస్తావన యెత్తలేదు, నాల్గురోజులతరువాత యాత్రలకంటూ ఇద్దరూ బయలుదేరారు నాకు తెలుసు వారు అలిగిపోతున్నారని. నాకు పట్టుదలగానే ఉంది. వాళ్ళ బంధాలు తెంచుకునిపోతే, నేనా తీసిపోయింది.

"ఈ ఓల్డ్ సెంటిమెంటుతో చస్తాంరా. నీకు నచ్చలేదు, గీ పెళ్ళాన్ని వదిలేస్తున్నావు, సింపుల్..." రాజా నాకు వంతపాడాడు. నాకు కావలసినంత స్వేచ్ఛ సాయంత్రము నేను, నా స్నేహితులు బార్‌లకు, యెక్కడ ఖరీదయిన కాలక్షేపమంటే అక్కడికి వెళ్ళేవారము. ఒక నాడు పాండే హడావుడిగావచ్చాడు.

"ఒరేయ్ గోపీ, నువ్వు తప్ప నాకెవరున్నారురా ! నీ చేతుల్లో పెరిగినవాడు మా పెద్దాడు మెడిసన్ చదువుతానని ఏడుస్తున్నాడు పిచ్చి సన్యాసి..."

"ఉపోద్ఘాతమంతా దేనికిరా డొనేషన్ కట్టు" చెక్కురాసిచ్చాను. రఫీ ఇల్లు కడుతుంటే సహాయముచేశాను. రాజా వ్యాపారానికి పెట్టుబడిపెట్టాను. జీవితమంటే స్నేహితులతో హోటల్లల్లో తిని పడుకోవటం అనుకున్నానే తప్ప, దానికో అర్థం, పరమార్థం ఉందని ఊహించలేదు. నాన్నగారు వ్రాసే ఉత్తరాలకు కూడా, నాల్గువస్తే ఒక్కసారి జవాబులువ్రాసేవాడ్ని.

రెండు సంవత్సరాలు తిరిగాయి. నాబ్యాంక్ బ్యాలెన్స్ తగ్గిపోయింది. నేను అన్న అహం, నాకే ప్రపంచజ్ఞానమున్నదన్న మిడిసిపాటు మిగిలాయి మెల్లగాస్నేహితులు తప్పుకున్నారు పూర్తిగా చెడిపోయాడు అంటూ ప్రచారం ప్రారంభమయింది. నేనే స్నేహానికి తప్పుడు నర్వచన చెప్పుకున్నాను. భజనరాయుళ్ళను స్నేహితులుగానమ్మాను. స్నేహముచేశాను. స్నేహము ఖరీదు చెల్లించాను. ఒంటరితనము, నా పాతజ్ఞాపకాలు నా శాంతిని తీసుకున్నాయి. పనిచేస్తూ అన్నీమరిచిపోవచ్చని రాత్రింబవళ్ళు పనిచేయటము ప్రారంభించాను. నా ఆహారము

సంగతే మరిచిపోయాను. యెన్నో రాత్రులు ఇంటికివచ్చి, నిద్దురపట్టక నిదురమాత్రలు వేసుకుని పడుకునేవాడిని. నా స్నేహితులనబడే భజనరాయుళ్ళ ఇండ్లలో పార్టీలు అవుతున్నాయి. ఫంక్షన్లు అవుతున్నాయి. నేనంటూ ఉన్నానని వారికి గుర్తేలేదు. వచ్చేబంధువులు మాత్రం యెవరున్నారు! అందరిని దూరం చేశాను. నా ఆరోగ్యం దెబ్బతిన్నది. వచ్చి ప్రయివేటు నర్సింగ్‌హోమ్‌లో చేరాను. డాక్టర్ గారు బాగా తెలిసినవారు. నర్సింగ్‌హోమ్ లోనే దూరంగా చిన్న ఉపవనములో ఉన్న ఇల్లు, (దాన్ని పెద్దవారు వాడుతారట) నాకిచ్చాడు. స్పెషల్ వార్డ్ అంటూ నర్సులు, డాక్టరు ప్రత్యేకంగాచూచినా ఏవో లోపము కనిపించేది. ఏమిటని ప్రశ్నించుకుంటే జవాబు లేదు. మనిషి డబ్బు చేతిలోఉండగానే తన వ్యక్తిత్వాన్ని అంచనావేసుకోవాలి. తను యెంతవరకు నిలబడగలడు ఈ భజనరాయుళ్ల మధ్య అని మొదటి పరీక్ష. ఇక రెండోది యెవరు తన హితులు అన్న విషయము తేల్చుకోవాలి. కొన్నిసార్లు మన అంచనా తప్పు కావచ్చు. కొన్ని తెగేవరకు తాడు లాగినట్టు నాలా పూర్తిగా మునిగేవరకు నమ్మవద్దు.

ఈ ఒంటరితనములో అందరూ గుర్తుకు వస్తున్నారు. నా స్నేహితులు నాకు దూరమయినాసరే, ఈ స్థితిలోవ స్తేబావుండును అనుకున్నాను. నేను అనుకున్నవారెవరురాలేదు, కాని యెన్నడు పిలువని సుధ వచ్చింది. రక్త సంబంధమా! ఆ రాత్రికి సుధ భర్తవచ్చాడు. ఒక గంట కూర్చుని వెళ్లిపోయాడు. రెండు రోజులు భారంగా గడిచాయి. సుధ పంపిన కాఫీ త్రాగుతున్నాను. అమ్మ కలిపిన కాఫీలా, చాలా బావుంది. అమ్మ, నాన్నావచ్చారు వారిని చూడగానే ఆనందముతో గంతులువేయాలన్నంత కోర్కె కల్గింది కాని లజ్జతో మాట్లాడలేకపోయాను.

"మేమిలారావటం నీ కిష్టంఉండదురా, కాని కన్నకడుపు, ఆ బంధం తెంచుకోలేకపోయాము." అమ్మ కన్నీటితో నా చేయి నిమిరింది

"అమ్మా!" దెబ్బతిన్నట్టు చూచాను.

"అమ్మను యెప్పుడో మరిచిపోయావు. లేకపోతే ఒక్క ఉత్తరం వ్రాయవా?" అన్నది కన్నీటితో. అవేవి నాకు కనిపించటంలేదు. యెంతో శాంతిగా, నిశ్చింతగా ఉంది. ఆత్మీయత అంటే ఏమిటని హేళనచేసే నాకు ఆ రోజు తెలిసింది ఆత్మీయత అంటే ఏమిటో!

"నాదే పొరపాటండీ, పిల్లలను గారాబంగా పెంచటమేకాదు, వివిధ పరిస్థితిల్లో బ్రతుకడం కూడా నేర్పాలి."

"ఊఁ..." నాన్న మాట్లాడలేదు. నాకు తెలుసు అయన నాగురించే ఆలోచిస్తున్నారని, నా కాపురము బాగుచేయాలని. అమ్మకు నా ఆరోగ్యం గురించి ఆందోళన 'మీరువచ్చారు నాకేం బావున్నానని అనాలనిపించింది. కాని నోరు విప్పలేకపోయాను. నిశ్చింతగా కళ్ళు మూసుకున్నాను. స్నేహము ఖరీదుతో కొనకండి. ఆత్మీయతతో ఆకట్టుకోండి" అని వచ్చినవారందరి దగ్గర అరవాలనిపించింది. ఏమీ చేయలేకపోయాను. ●


ఖాతాదారులకు, మిత్రులకు, సంక్రాంతి శుభాకాంక్షలు

గ్రామ్స్: ఏషియాటిక్స్ ఫోన్స్: 76365, 77530

# ఏషియాటిక్ ట్రేడర్సు

(రిజిష్టర్డు)

ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్స్:

గవర్నరుపేట :: విజయవాడ-2

హిమాయత్‌నగర్ :: హైదరాబాద్-29